# బాల్యం!!

మళ్ళీ తెల్లవారింది. తెల్లవారడం అంటే మళ్ళీ కోడి కూయడం.. మళ్ళీ పన్లోకి వెళ్ళడం.. మళ్ళీ తిట్లు తినడం...

ఏడేళ్ళ కోటిగాడికి తెల్లవారడం అంటే.. చాన్నాళ్ళుగా వున్న తన మోకాలి పుండు మీద మళ్ళీ ఒక్కసారిగా ఈగలు ముసరడం.

ఊహ తెలిసినప్పటినుంచీ ప్రతి తెల్లవారుఘామునీ అలా భయంగానే వీక్షిస్తున్నాడు వాడు. ఊహ తెలిసినప్పటినుంచీ..! అనొచ్చా అలా! ఇపుడిపుడే ఊహ తెలుస్తూన్న కోటిగాడు అనాలా!

ఏమో! పాలు మరిచీ ఎన్నాళ్ళయిందో! కొలువు కుదిరీ ఎన్నాళ్ళయిందో!

వాడి కోరిక మాత్రం కొన్ని యుగాలుగా వాడి మనసులో గూడు కట్టుకుని వుంది. ... అంటే దాదాపుగా పన్నెండు నెలలనుంచీ, యాభై వారాల నుంచీ... మూడు వందలా అరవైఅయిదు రోజులనుంచీ!

అవును. సరిగ్గా సంవత్సరం క్రితం తెలిసింది వాడికి..

".. రోజూ తను పనిలోకెళ్ళిన కాసేపటికి సూరీడొస్తాడంట. ఆడు మెలమెల్లగా గుడిసె పైకి పాకతా వుంటే... కప్పుకి వున్న సిల్లుల్లోనుంచీ ఆ ఎలుగులు అట్టా నేలమీదికి జారతాయంట. తను చెత్తకుప్పలోనుంచి ఏరుకొచ్చిన అద్దం ముక్కుందే.. పగిలి పోయిన అద్దం ముక్క.. దాని మీద పడతాయంట ఆ ఎలుగులు. ... తడికెల మీద గుండ్రాలు గుండ్రాలుగా మెరుస్తాయంట. ... అప్పుడు గుడిసె గుడిసంతా బంగారం నాగ వుంటదంట.."

వాడి చెల్లెలు సారమ్మ చెప్పింది వాడికిదంతా. అది చెప్పిన తీరులోని మహత్యమో! వాడి జీవనరీతిలోని దౌర్భాగ్యమో! కారణమేదయినా వాడి మనసులో మాత్రం ఆ దృశ్యం ఒక ఊహాచిత్రంలా నిల్చి పోయింది. దాన్ని యదార్థంగా చూడాలన్న ఆశతో వాడి హృదయం కొట్టుకుపోతోంది.

ఒకరోజు కాదు. రెండు రోజులు కాదు. దాదాపు సంవత్సరం నుంచీ!

కానీ ఎలా కుదుర్తుంది! కుదరదు.

చీకటితోనే పన్లోకి రావాలని తులశమ్మగారు ముందే చెప్పింది.

పాలపాకెట్లు తెచ్చిపెట్టడంతో మొదలవుతుంది వాడి డ్యూటీ.

ఆ తర్వాత నీళ్ళు పట్టాలి. ఇల్లు తుడవాలి. ఏమన్నా సరుకులు కావాలంటే బజారుకెళ్ళి తెచ్చిపెట్టాలి. అయ్యగారికి టిఫిన్ డబ్బా యిచ్చి రావాలి.

బుల్లయ్యగారిని ఆడించాలి.

".. ఆడించడమంటే కూసుని ఆడుకోడం కాదు, ఆరు ఏడవకుండా సూసుకోవాలి. అంటే ఎప్పుడూ ఎత్తుకుని తిప్పుతా వుండాలి."

వీటన్నిటిమధ్యా సూర్యుడు ఎప్పుడొస్తాడో, ఎప్పుడు పోతాడో కోటిగాడికి తెలిసే అవకాశమయినా ఉండదు.

ప్రొద్దునపూట నీళ్ళు పట్టడమూ..

రోజంతా పసిపిల్లాడిని ఎత్తుకుని మోయడమూ రెండూ వాడి శక్తికి మించిన పనులే.

కోటిగాడి భాషలో బుల్లయ్యగారయిన ప్రశాంత్ తులశమ్మగారికి మనవడు. కొడుకు, కోడలు, పెళ్ళికావలసిన కూతురు.. అందరూ ఉద్యోగాలకి వెళ్తే పసివాడిని చూడడం ఆవిడ వల్ల కాలేదు. అందుకే ఒక పనివాడు అవసరమయ్యాడు. ఎపుడయితే పనివాడు దొరికాడో, అపుడు పసిపిల్లాడిని చూడటంతో పాటు, యింకా చాలా పనులు వాడి నెత్తిమీద ఆటోమేటిగ్గా పడిపోయాయి.

సాయంత్రం.. స్వప్నమ్మగారు, అదే.. తులశమ్మగారి కోడలు వచ్చేదాకా పసిపిల్లాడి బాధ్యత తప్పదు కోటిగాడికి. ఆవిడ వచ్చాక, అప్పుడు మొక్కలకి నీళ్ళు పెట్టి, ఏడవుతూండగా గుడిసె చేరతాడు.

తల్లి పళ్ళెంలో అన్నం పెట్టి యిస్తే, అది తిని, గుడిసె బయట... చల్లటి వెన్నెల్లో... ఒక చిన్న గుడ్డ పరుచుకుని పడుకుంటాడు.

అప్పుడు.. అలా పడుకుని ఆకాశంలోని చంద్రుడినీ, చుక్కలనీ చూస్తున్నపుడు... మళ్ళీ వాడి కోరిక మెల్లగా మనసుని గుచ్చుతుంది.

"అమ్మా! రేపొక్కరోజా పన్లోకెళ్ళనే!" అంటాడు మొరపెట్టుకుంటున్నట్లుగా.

లక్ష్మి అరవదు. ఆశ్చర్యంగా చూడదు. కనీసం మొహమయినా తిప్పదు. "పోకుంటే ఎట్లా... అమ్మగారికి కోపమొస్తాది" అంటుంది చాలా నిరాసక్తంగా.

ప్రతిరోజా నిద్రపట్టబోయే ముందు వాడు అదే ప్రశ్న అడుగుతాడు. లక్ష్మి నోటివెంట అదే జవాబు వస్తుంది.

ఆ తర్వాత కాసేపటికి... తాగుతూ, తూలుతూ, తిడుతూ రాఘవులొస్తాడు.

ఆ అలికిడికి ఉలిక్కిపడినట్లుగా లేస్తాడు కోటి. తల్లి అన్నం పెట్టడం.. తండ్రి తినడం.. గుడిసెలోని నులకమంచం మీద పడుకుని గుర్రు పెట్టడం...

అన్నీ ఓరకంటితో గమనిస్తాడు.

తల్లి మెల్లగా వచ్చి చెల్లెల్ని ఎత్తుకెళ్ళి లోపల పడుకోబెడ్తుంది. తర్వాత వాడ్ని నడిపించుకెళ్తుంది.

ఆమె ప్రక్కన పడుకుని యిలా కళ్ళు మూసుకుంటాడో లేదో..!

"...అయిదవుతూంది. లే. పనికి బోవా!" అంటూ మళ్ళీ లేపేస్తుంది.

ఇంతే. రోజూ యిలాగే జరుగుతుంది. సంవత్సరం నుంచి ప్రతీ రోజూ యిలాగే జరుగుతోంది.

ఆరోజూ అలాగే భయం భయంగా నిద్ర లేచాడు కోటి.

నిద్రకళ్ళతో, తూలుతూ తులశమ్మగారింటికి బయల్దేరాడు. ఎందుకో ఉండుండీ ఏడుపొస్తోంది వాడికిరోజు.

ఒక్కరోజు.. ఒక్కరోజు కూడా పనిమానేయడానికి వీల్లేదన్న నిజం ... నిజంగా ఎంత బాధాకరం!

"ఇంత లేట్ గా పాలు పట్టుకొస్తే... కాఫీలెప్పుడు తాగాల్రా!" అన్న అరుపుతో రోజు మొదలయింది.

ఇక అప్పటినుండీ.. సాయంత్రం స్వప్న వచ్చేవరకూ బొంగరంలా తిరుగుతూనే ఉన్నాడు కోటి.

ఆవిడ వచ్చాక అప్పుడు పిల్లాడ్ని తీసుకెళ్ళి స్నానం చేయించింది.

కోటిగాడు మొక్కలకి నీళ్ళు పోస్తుంటే.. ఒక చిన్న గిన్నెలో అన్నం కలుపుకుని, ప్రశాంత్ ని ఎత్తుకుని తోటలోకి వచ్చింది.

ఆకాశంలోని చందమామని చూపిస్తూ అన్నం తినిపించసాగింది.

గెంతులు వేస్తూన్న ప్రశాంత్ నే మురిపెంగా చూస్తూ... "పిల్లలకి చందమామ అంటే ఎంత యిష్టమో చూడు!" అంది అప్పుడే వచ్చిన ఆడపడుచుతో.

ఆడపడుచు నవ్వింది. "ఒక్క చందమామ అని ఏముంది వదినా! ప్రకృతిలో దేన్ని చూసినా సంబరపడతారు వాళ్ళు. మనం మాత్రం!! మనకి వుండదూ ఈ మెకానికల్ జీవితానికీ, యంత్రాల్లాంటి మనుషులకీ దూరంగా.., పచ్చటి ప్రకృతి మధ్య కాలం గడపాలని!"

"కర్మే . వెధవ ఉద్యోగాలూ. బాధ్యతలూ." భుజాలు కుదిస్తూ అంది స్వప్న. "మళ్ళీ బాల్యం తిరిగొస్తే బాగుండుననిపిస్తుంది."

" బాల్యం. . అవును. బాల్యం ఎంత మధురమయినది! చివరికి రాక్షసుల్ని సంహరించడం కోసం అవతారాలెత్తినపుడు కూడా భగవంతుడు బాల్యాన్ని అందంగా మలుచుకున్నాడు కదా వదినా! రామావతారంలో ముగ్గురు తల్లులూ, తండ్రీ. . ముద్దు చేస్తే చాలలేదు కాబోలు. కృష్ణావతారంలో రేపల్లె అంతటితోనూ గారాలు పోయాడు." ఆడపడుచు మాటలకి స్వప్న నవ్వింది. "నిజమే సుమా! చందమామ కోసం ఏడవడం. . వెన్న దొంగిలించడం. . మట్టి తినడం. . బాల్యంలోని ప్రతీ బిట్ నీ తన ధోరణిలో ఆనందించాడు దేవుడు. అసలు ఆ బాల్యాన్ని అనుభవించడం కోసమే ఏదో ఒక వంక పెట్టుకుని అవతారాలెత్తాడేమో అనిపించేలా!"

ఇద్దరూ గలగలా నవ్వుకున్నారు.

కోటిగాడికి ఆమాటలేవీ స్పష్టంగా అర్థం కాకపోయినా, ఒక్కటిమాత్రం తెలిసింది. తనకి సూర్యుడ్ని చూడాలనిపించడం తప్పుకాదనీ, అది తీర్చుకోదగ్గ కోరికేనని. . దానికోసం తను గొడవ చేయొచ్చనీ తెలిసింది.

ఆ నిర్ణయంతో వాడు యింటికి వెళ్ళేసరికి తండ్రి ముద్దుగా దగ్గరికి తీసుకున్నాడు.

"అరే కోటీ! రేపు తులశమ్మగారింటికి పోయినపుడు పని మానేస్తున్నానని చెప్పి డబ్బులట్టుకొచ్చేయరా!" అన్నాడు.

ఆశ్చర్యంగా చూశాడు కోటి. సంతోషంతో వాడి కళ్ళు మెరిశాయి.

"ఏందయ్యా!" అన్నాడు తను సరిగా వినలేదేమోనన్న అనుమానంతో.

"అవున్రా. రేపటికాడ్నుంచీ నిన్ను వేరే పన్లో పెడతన్నా. ఇక పొద్దుటేల పన్లోకెళ్ళక్కర్లా నువ్వు. సందేల ఎళ్ళి రేతిరంతా పనిచేయాలి. మళ్ళీ తెల్లారగట్ల నాలుగూ. . అయిదూ. . ఆకాడికి యింటికొచ్చేయచ్చు."

". . . ఎక్కడా పని!" లక్ష్మి అడిగింది.

"ఇక్కడేలే. . మనకి తెలిసినోడే. ఇనుపసామాన్లు చేస్తరు." చెప్పాడు రాఘవులు.

"ఆ పని ఈడికేం చేతనవుద్ది!"

". . . చేతకాకుంటే నేర్పుతరు. ."

రాఘవులు మొహంలో సంతోషాన్ని గమనించి "ఏమిస్తమన్నరు!" అంది.

రాఘవులు మాట్లాడలేదు. ముసిముసిగా నవ్వి వూరుకున్నాడు.

మంచి జీతమే యిస్తామన్నారని లక్ష్మికి అర్ధమయింది.

కోటిగాడికి మాత్రం యివేవీ పట్టలేదు. వాడికి అర్ధమయింది ఒకటే. ఇక మీదట తను ప్రొద్దున పూట పన్లోకి వెళ్లక్కరలేదు.

"అంటే.. అంటే.. పొద్దెక్కేదాకా గుడిసెలో పడుకుని సూర్యుడ్ని చూడొచ్చు."

ఆ ఆలోచనతో వాడి అలసట అంతా ఎగిరిపోయింది. హుషారుగా అన్నం తిని తియ్యటికలలు కంటూ నిద్రపోయాడు.

మర్నాడు ప్రొద్దున చీకటితో లేచాడు. మొట్టమొదటిసారి తులశమ్మగారింటికి హుషారుగా వెళ్ళాడు.

ఆపనీ, ఈపనీ చేసి సాయంత్రానికి తిరిగొచ్చాడు. ఆతర్వాత కాస్త అన్నం తిని క్రొత్తపనికి బయల్దేరాడు.

వెళ్ళేటపుడు చెల్లెలి దగ్గరకెళ్ళి "సారా! రేపు నేను తెల్లారగట్లే వచ్చేసి సూర్యుడ్ని చూస్తా." అని చెప్పాడు సంబరంగా.

అది అంతకన్నాను. అన్నకు పట్టిన ఈ గొప్ప అదృష్టానికి మురిసిపోయి చప్పట్లు చరుస్తూ గంతులు వేసింది.

కోటిగాడికి పెద్ద కష్టంగా అనిపించలేదు అక్కడి పని. పెద్ద శబ్దంతో టేప్ రికార్డర్ మోగుతూ వుంటే, ఆ పాటలు వింటూ.. వాళ్ళు అడిగినవి అందించడం. అంతే. అన్నీ వాడికి యిష్టమయిన పాటలే. అవి వింటూ వుంటే ఎన్నిసార్లు అటూ యిటూ తిరిగినా అలసట తెలీలేదు.

మొదట బాగానే అనిపించింది కానీ పన్నెండు దాటాక అపుడు అర్ధమయింది అసలు కష్టం. నిద్రతో కళ్ళు మూసుకుపోసాగాయి. పాటలూ వినబడడం లేదు. వాళ్ళ మాటలూ వినబడడం లేదు. "ఓర్నీ! నిద్రపోతన్నావేందిరా ఎదవా!" అన్న అరుపుతో వాలిపోతున్న కళ్ళని బలవంతంగా తెరిచాడు కోటి.

అంత నిద్రమత్తులోనూ "తెల్లారకముందే యింటికి పోవచ్చు" అన్న ఆలోచన మనసు లోతుల్లో మెదిలింది.

"ఇట్టారా! వెల్డింగ్ నేర్పుతా."

తూలుకుంటూ ఆ అరుపు వినపడ్డ దిశగా నడిచాడు.

కాళ్ళు నడుస్తున్నా, కళ్ళు నిద్రకి లొంగిపోతున్నాయి.

వెళ్ళి అతని ప్రక్కన కూర్చుంటూ వుంటే మర్నాడు ప్రొద్దున తను చూడబోయే సూర్యగోళం నారింజరంగులో భువనమోహనంగా వాడి కళ్ళ వెనుక మెరిసింది.
కళ్లు తెరిచిన మరుక్షణం అద్దం వెనుకనుండి అంతకు మించిన వెలుగు కళ్లల్లోకి దూసుకు వచ్చింది.
నిద్రమత్తు వదిలిపోయింది.
వెల్డింగ్ చేస్తూన్న కుర్రాడు నవ్వాడు. "ఏరా! నేర్చుకుంటావా!" అన్నాడు.
కోటిగాడు తలూపాడు.
"ఇదిగో సూడు. ఈపని చేసేటపుడు ఎపుడూ ఈ అద్దంలోనుంచే చూడాల. లేకపోతే కళ్ళుపోతయ్. ఏంది అర్థమయిందా! జాగ్రత్తగా సేయాల."
అతను చెప్తూంటే తలవూపుతూ దగ్గర చేరాడు. అతన్నే గమనిస్తూ పనిలో లీనమయాడు.
అంతే. తెల్లగా తెల్లవారిపోయేవరకూ వాడికి విముక్తి లభించలేదు.
"ఏందన్నా! ఆలీసంగా వచ్చావ్?" అంది సారమ్మ వాడు గుడిసె చేరగానె.
"ఇయాల క్రొత్తపని నేర్చుకున్నాలే. మెరుపుల మెరుపుల పని." అలసటా, అసంతృప్తీ కలగలిసిన స్వరంతో చెప్పాడు.
సారమ్మ జాలిగా చూసింది. అది గమనించి, "రేపు తొరగా వచ్చేస్తా" అన్నాడు.
కానీ మర్నాడూ అలాగే అయింది. ఆమర్నాడు కూడా. . .
ఆ తర్వాత సంవత్సరం పాటూ ప్రతీ మర్నాడూ అలాగే గడిచింది.
కోటిగాడు యింకొంచెం పెద్దవాడయ్యాడు.
అద్దం ముక్కలోనుంచి మెరిసే సూర్య కిరణాల్ని చూడాలన్న తన పాత కోర్కెని వాడిప్పుడు మర్చిపోయాడు.
అర్ధరాత్రిపూటే అంతకుమించిన వెలుగుల్ని చూడడం అలవాటు చేసుకున్నాడు.
అవును. ఇపుడు. . ప్రతీరోజూ. . తెల్లవారుఝామున అయిదుగంటలకి బాలభానుడు వులిక్కిపడి నిద్ర లేస్తాడు. తూర్పు దిక్కునుంచి మెల్లమెల్లగా పాకుతూ వస్తాడు.
చిట్టి చిట్టి చేతులతో నేర్పుగా వెల్డింగ్ చేసే కోటిగాడిని అబ్బురంగా చూస్తూ ఆకాశంలో నిలబడతాడు.

*****